క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రతిష్ట



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బెన్నుగానిపేట గ్రామ దేవత మా అంబికా దేవి ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించగా, సామూహిక కుంకుమ పూజలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. బాహుదా నది నుంచి తెచ్చిన గంగాజలంతో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు.

ద్విచక్ర వాహనాల వేలంపాట నేడు

ఇచ్ఛాపురం రూరల్: నాటుసారా తరలిస్తూ పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలకు శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ ఎస్ఐ ఎస్.గురుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాజుగారి కోట నందు గల తమ కార్యాలయం వద్ద ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న వేలంలో, ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని సూచించారు.

వజ్రపుకొత్తూరు రూరల్: పలు మద్యం కేసులో పట్టుబడిన వాహనాలను స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో కార్యాలయం పలాసలో శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు స్టేషన్ హౌస్ అధికారి కె.కృష్ణారావు, తహసీల్దార్ బి.అప్పలస్వామిలు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అసక్తి ఉన్నవారు తమ అధార్ కార్డుతో పాటు ప్రవేశ రుసుము రూ.1000లు చెల్లించాలని సూచించారు.

583 జీవాలకు టీకాలు



జియ్యన్నపేటలో టీకాలు వేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు, తర్లిపేట, చీపుర్లపాడు ఆర్‌బీకేల పరిధిలోని ఎరకయ్యపేట, చలమయ్యపేట, జియ్యన్నపేట, బమ్మిడిపేట, నారాయణపురం, కన్నెవలస తదితర గ్రామాల్లో జీవాలకు టీకాలు గురువారం వేశారు. కురుడు పశు వైద్యుడు లఖినేని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచితంగా 583 జీవలకు గొంతు వాపు, జబ్బ వాపు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు చిరంజీవి, ముకుందరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉపా చట్టం రద్దు చేయాలి'



ఉపా చట్టంపై నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఉపా చట్టం రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సూదికొండలోని ఆ పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వంకల మాధవరావు, పత్రి దానేష్, పిండి వెంకటరావు, ఈశ్వరమ్మ, నెయ్యిల గణపతి, చాపర వేణుగోపాలరావు, మామిడి భీమారావు తదితరుల పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామంలో ఒంటరిగా నివాసముంటున్న కొండక కాళిదాసు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలియడంతో బ్రాహ్మణతర్లా హెల్పింగ్ సంస్థ సభ్యులు ఆదుకున్నారు. గురువారం ఉదయం తన ఇంటి వద్దకు చేరుకుని రూ.12,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో కుమార్, వేణు, ఆర్‌జే ఈశ్వర్, బాలరాజు, హరికృష్ణ, అనిల్, జోగారావు పాల్గొన్నారు.

'సేవలు వినియోగించుకోండి'



స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: సత్యసాయి ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవలను యువత వినియోగించుకోవాలని సత్యసాయి సేవా సమితి స్టేట్ ప్రెసిడెంట్ ఆర్.లక్ష్మణరావు కోరారు. స్థానిక సత్యసాయి సేవా సమితి భవనంలో కొత్తగా ఏర్పాటు చేసిన స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం 20 కంప్యూటర్ల ద్వారా ప్రతిరోజూ ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా ప్రెసిడెంట్ వై.లింగరాజు, స్థానిక ప్రతినిధులు ఎస్.అనాథగుప్తా, ఎస్.ఆనందరావు, ఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు.

అధ్వానం.. అద్భుతం



నాడు నేడు



పై ఫొటోలో కనిపిస్తున్నది గరుడకండి– మహదేవిపురం రహదారి. ఈ రహదారి అప్పట్లో అధ్వానంగా ఉండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. దీంతో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కృషితో రూ.39.80 లక్షల ఏఐఐబీ–1బీ గ్రాంట్‌తో 1.74 కిలోమీటర్లు మేర రహదారి చక్కగా నిర్మాణం పూర్తి చేసుకుంది. శంకుస్థాపన చేసిన నెల రోజుల్లోనే రహదారిని నిర్మించి, బట్టుపాడు, మహదేవిపురం, గరుఢకండి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

– వజ్రపుకొత్తూరు

జగనన్న సురక్ష.. సామాన్యుడికి భరోసా

టెక్కలి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపీడీవో హెచ్.వి.రమణమూర్తి సూచించారు. మండలంలోని అయోధ్యపురం పంచాయతీ పరిధి నంబాళ్లపేట, బన్నువాడ పంచాయతీ మోదుగువలస గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై గురువారం ఇంటింటా సర్వే నిర్వహించారు.

ఇచ్ఛాపురం రూరల్: గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో చారిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. గురువారం అరకభద్ర సచివాలయంలో జగనన్న సురక్ష పథకంపై వలంటీర్లు, జేసీఎస్ కో–ఆర్డినేటర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు.



కంచిలి: జాడుపూడి సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

సమావేశంలో మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు రంగాల కృష్ణారెడ్డి, తిప్పన ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: జూలై 1వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష క్యాంపులను విజయవంతం చేయాలని ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. మండలంలోని జాడుపూడి, మకరాంపురం, పెద్దశ్రీరాంపురం, తలతంపర–1, 2, మండపల్లి సచివాలయాలను గురువారం సందర్శించారు. మండలంలో జూలై ఒకటో తేదీన జాడుపూడి, మకరాంపురం సచివాలయాల పరిధిలో సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రాంబాబు తదితరులు ఉన్నారు.



ఇచ్ఛాపురం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పుష్ప



టెక్కలి: నంబాళ్లపేట గ్రామంలో సురక్ష సర్వే చేస్తున్న సిబ్బంది

జేసీఎస్ ఇన్‌చార్జిల నియామకాలు

జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు...

టెక్కలి	శిగిలిపల్లి మోహన్‌రావు
కోటబొమ్మాళి	గెడ్డవలస నాగభూషణరావు
సంతబొమ్మాళి	మోడి భాస్కర్‌రెడ్డి
నందిగాం	జద్యాడ జయరాం
ఇచ్ఛాపురం	ఆశి పురుషోత్తంరెడ్డి
ఇచ్ఛాపురం మున్సిపాలిటీ	సాలిన ఢిల్లీరావు
కంచిలి	కొణపల సురేష్
కవిటి	జల్లు యుగంధర్
సోంపేట	బుద్దాన శ్రీకృష్ణ
పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ	బడగల బ్రహ్మయ్య
మందస	చింతాడ గణపతి
పలాస	దువ్వాడ రవి
వజ్రపుకొత్తూరు	వడ్డి కరుణాకర్

భక్తిశ్రద్ధలతో బక్రీద్



కంచిలి: ప్రార్థనలు జరుపుతున్న దృశ్యం



కాశీబుగ్గ: జామియా మసీదులో ప్రార్థనలు



ఇచ్ఛాపురం: ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కంచిలి: మండలంలో ముస్లింలు బక్రీద్ పండగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జాతీయ రహదారి పక్కనున్న మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మసీదు ప్రెసిడెంట్ తాజుద్దీన్ ఖాన్, మసీద్ ఇమామ్ థసీర్, హఫీజ్ వజీద్ అలీ, సలావుద్దీన్, ఎండీ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే పండగల్లో బక్రీద్ ఒకటి. ఈ మేరకు గురువారం పట్టణంలోని లాలాపేటవద్ద ఉన్న జామా మసీద్, కస్పావీధి మసీద్‌ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జామా మసీద్ ముతవల్లి మహ్మద్ అహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండల పరిధిలో ఉన్నటువంటి మసీదుల వద్ద గురువారం బక్రీదు పండగను ఘనంగా నిర్వహించారు. కాశీబుగ్గ జామియా మసీద్, పలాస మసీద్, పలాస మండలంలో బ్రాహ్మణతర్లా, తర్లాకోట మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

మర్యాదపూర్వక భేటీ



ఎంపీపీ రోణంకి ఉమా మల్లయ్య తదితరులతో మాట్లాడుతున్న దువ్వాడ వాణి

టెక్కలి: వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియామకమైన దువ్వాడ వాణి కోటబొమ్మాళి, నందిగాం మండలాల్లో పలువురు వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కోటబొమ్మాళి ఎంపీపీ రోణంకి ఉమా మల్లయ్య, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, కళింగ కార్పొరేషన్ డైరక్టర్ సంపతిరావు హేమసుందర్‌రాజు తదితరులను కలిశారు. రానున్న 2024 ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి సమష్టిగా పనిచేసేందుకు సహకరించాలని కోరారు. ఆమెతో పాటు టెక్కలి ఎంపీపీ ఎ.సరోజనమ్మ, మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, నాయకులు డి.రామకృష్ణారెడ్డి, బి.నాగేశ్వరరావు, డి.సిమ్మన్న, కె.రామరాజు, కె.సంజీవరావు, కె.గోవిందరావు, బి.సూర్యం, బి.వెంకటరమణ, ఎల్లయ్య, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

కవిటి:

మండలంలోని సహలాలపుట్టుగలో గురువారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామివారికి గారెల మాల, తమలపాకుల మాలలను వేసి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గస్యా రవిప్రధాన్, బడ్డాయి మురళి, ఇప్పిలి కృష్ణారావు పాల్గొన్నారు.



స్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఔషధ మొక్కలు మేలు చేస్తాయి



ఔషధ మొక్కలతో సత్యసాయి భక్తులు, గ్రీన్ ఆర్మీ సభ్యులు

కాశీబుగ్గ: ఔషధ మొక్కలు మానవాళికి ఎంతో మేలు చేస్తాయని వక్తలు అన్నారు. పలాస రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో ఉసిరి మొక్కలతో పాటు ఔషధ మొక్కలను గురువారం నాటారు. కార్యక్రమంలో విద్యా విహార్ కరస్పాండెంట్ మల్లా రామేశ్వరం, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, జాతీయ అవార్డు గ్రహీత మధుబాబు, సినీ నటుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జన జాగృతి వార్షికోత్సవం నేడు

కాశీబుగ్గ: స్థానిక డెంకివీధిలో పలాస జనజాగృతి సప్తమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు లఖినాన వెంకటాచలం, వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తిలు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కవులు, కళాకారులు, రచయితలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎంపికైనవారి జాబితా విడుదల

సోంపేట: స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఎంపికైనవారి జాబితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జాబితాలు పాఠశాల వద్ద నోటీసు బోర్డులో పెట్టడం జరిగిందన్నారు. ఎంపికైనవారు జూలై 6వ తేదీలోగా అన్ని ధ్రువపత్రాలతో జాయన్ అవ్వాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- అమలకుడియాలో గడప గడపకూ మన ప్రభుత్వం

పలాస: గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలో అమలకుడియా పంచాయతీలోని అమలకుడియా, వీరభద్రాపురం, పూర్ణభద్ర గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా పూర్ణభద్ర గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ కొర్ల శిరీష ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు చేసినటువంటి సంక్షేమ పథకాలను వివరించారు. కడుపులో బిడ్డ నుంచి వృద్ధుల వరకు ప్రభుత్వం అనేక రకాలుగా సంక్షేమ పథకాలను అందజేసిందన్నారు. ఇంకా సాంకేతిక కారణాలు వల్ల పథకాలు అందని లబ్ధిదారులు ఉంటే, వారి సమస్యలను కూడా తెలుసుకొని పరిష్కరించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమను ప్రజల వద్దకు పంపిస్తున్నారని పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వాన్ని మరొకసారి ఆశీర్వదించాలని కోరారు. అమలకుడియా–వీరభద్రపురం రోడ్డు, అమలకుడియా కాలనీకి రోడ్డు, వీరభద్రపురం గెడ్డ వరకు రోడ్డు పొడిగింపు, అమలకుడియాలో నాడు–నేడుతో పాఠశాల అభివృద్ధి, వీరభద్రాపురానికి ఓవరు హెడ్ ట్యాంకు, శ్మశాన వాటికకు రోడ్డు, అమలకుడియా కాలనీకి పైపులైను తదితర పనులు చేపట్టామన్నారు. ఇంటింటికీ కుళాయి కావాలని సర్పంచ్ శిరీష కోరగా వాటిని త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ, జెడ్పీటీసీ మచ్చ రత్నాలు, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు, మందస ఎంపీపీ డొక్కర దానయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ, కొర్ల మురళీకృష్ణ, సచివాలయ కన్వీనర్ దువ్వాడ రవి, కొర్ల సంతోష్, దంతం, వైకుంఠరావు, ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంఈవో శ్రీనివాసరావు, ఏవోఆర్డీ మెట్ట వైకుంఠరావు, వ్యవసాయాధికారి పోలారావు తదితరులు పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చలపై అవగాహన అవసరం

వజ్రపుకొత్తూరు రూరల్: శరీరంపై ఏర్పడే స్పర్శలేని మచ్చలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూపర్‌వైజర్ చక్రధర్ అన్నారు. మండలంలోని సీతాపురం, పెద్ద బొడ్డపాడు గ్రామాల్లో గురువారం పర్యటించి ఇంటింటా సర్వే నిర్వహించారు. శరీరంపై ఏర్పడిన మచ్చలపై అవగాహన కల్పించారు. మచ్చలతో అనేక సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, దీనిపై అప్రమత్తంగా ఉండి వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆయనతో పాటు సిబ్బంది యశోద, చిన్నమ్మ తదితరులు ఉన్నారు.



ఇంటింటా సర్వే చేస్తున్న వైద్య బృందం

హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

కవిటి: మండలంలోని బొరివంక బీసీ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వసతి గృహ సంక్షేమాధికారి జి.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బొరివంక, ఇద్దివానిపాలెం ఉన్నత పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో చదువుతున్న 6 నుంచి 10 తరగతుల బాలురు చేరేందుకు 65 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. బొరివంక వసతి గృహ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చని పేర్కొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

వజ్రపుకొత్తూరు: మండలంలోని దేవునల్తాడకు చెందిన చెక్క కృష్ణారావుపై అదే గ్రామానికి చెందిన చెక్క రాజు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం పూండి దేవునల్తాడ మధ్య లింగాలపాడు వద్ద టాటా మేజిక్ వాహనం నడుపుతూ వస్తున్న కృష్ణారావును బుల్లెట్ బండిపై వచ్చిన రాజు అడ్డగించాడు. వెంట తెచ్చుకున్న క్రికెట్ బ్యాట్‌తో వాహనం అద్దాలు, డోర్‌లు పగలుగొట్టి కృష్ణారావును బయటకు లాగి విచక్షణా రహితంగా చితక బాదాడు. స్థానికులు అడ్డగించినా ఆగకుండా కొట్టడంతో చేతులు, చాతి పక్కటెముకలు విరిగిపోయాయి. అనంతరం దేవునల్తాడ వెళ్లి కృష్ణారావు కుటుంబ సభ్యులపై దాడి చేశాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వై.మధుసూదనరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని కృష్ణారావును 108లో పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడికి గల కారణాలు తెలియలేదు. బాధితుడి భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వజ్రపుకొత్తూరు ఎస్ఐ వై.మధుసూదనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణారావు

తొలి ఏకాదశి పూజలు



ఇచ్ఛాపురం రూరల్: బొడ్డఖాళీలో పూజలందుకుంటున్న శ్రీనివాసుడు

తొలి ఏకాదశిని పురస్కరించుకొని అన్ని ఆలయాలు భక్తులతో గురువారం కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అన్నసంతర్పణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కంచిలి: రాధాకృష్ణ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు తదితరులు



సోంపేట: శ్రీరంగనాథుని అవతారంలో దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి

కేన్సర్ బాధిత చిన్నారికి సాయం

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి గ్రామానికి చెందిన చిన్నారి గిన్ని నైమిష కేన్సర్ బారినపడింది. ఈ చిన్నారి వైద్యానికి రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబం తల్లడిల్లుతోంది. ఈ విషయం తెలుసుకున్న ట్రూ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు చిన్నారి వైద్యం కోసం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి బుధవారం అందించారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.కృష్ణంరాజు, గెడ్డెం కృష్ణ, పూనా రజనీకాంత్, కాశీ, శివ, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కవిటి: మండలంలోని బొరివంక ఉప విద్యుత్ కేంద్రానికి విద్యుత్ సరఫరా చేసే 33/11 కేవీ విద్యుత్ లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్టుకొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు మండల ట్రాన్స్‌కో ఇంజినీర్ ఎం.నేతాజీ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సబ్‌స్టేషన్ పరిధిలోని బొరివంక, ఇద్దివానిపాలెం, మాణిక్యపురం, బి.గొనపపుట్టుగ వాటర్ సర్వీస్ ఫీడర్లలో ఈ అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.